అన్నమయ్య సంకీర్తన గానం రేపు

నల్లకుంట: తాళ్లపాక అన్నమయ్య వర్ధంతిని పురస్కరించుకొని శ్రీ సాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 26న 'అన్నమయ్య సంకీర్తన గానం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపేట మోహన్‌నగర్‌లోని హరిహర క్షేత్రం, శ్రీఅలివేలు మంగసమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో సాయంత్రం 6గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు టీటీడీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులతో సామూహిక సంకీర్తనార్చన ఉంటుందని చెప్పారు. వర్ధమాన గాయినీమణులు నందిని, యామినిల సహకారంతో అకాడమీకి చెందిన సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. అలాగే టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ స్వరపర్చిన అన్నమయ్య కీర్తనల గానంతో గరిమెళ్లకు నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. హరిహర కళా క్షేత్రం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఏప్రిల్ 24 నుంచి 'ప్రతినోట అన్నమయ్య పాట' శీర్షికన భక్తిగీతాల్లో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా తెలిపారు.

ఏప్రిల్ 28 నుంచి బాలలకు వేసవి శిక్షణ శిబిరం

కాచిగూడ: బాలానందం వేసవి శిక్షణ శిబిరం ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 28వ తేదీ వరకు నారాయణగూడలోని బాలానంద భవన్‌లో నిర్వహిస్తున్నట్లు బాలానందం ట్రస్ట్ అధ్యక్షురాలు జీవీ కామేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నృత్యం, లలిత సంగీతం, చిత్రలేఖనం, తదితర అంశాల్లో బాలబాలికలకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా –ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొకైన్ విక్రయిస్తున్న నైజీరియన్ రిమాండ్


నిందితుడు గాడ్విన్

కాచిగూడ: గుట్టు చప్పుడు కాకుండా కొకైన్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న తెలిపిన వివరాల ప్రకారం... గాడ్విన్ (34) అనే అంతర్జాతీయ (నైజీరియన్) డ్రగ్ పెడ్లర్ నగరంలోని వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కొంత కాలంగా కాచిగూడలో ఇద్దరు స్నేహితులతో కలిసి గుట్టుచప్పుడు కాకుండా కొకైన్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. కొకైన్ అమ్ముతున్న గాడ్విన్‌ను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కాచిగూడ పోలీసులకు అప్పగించారు. గాడ్విన్ నుంచి రూ.42వేల విలువ చేసే 7 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం గాడ్విన్‌ను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

కాచిగూడ: కుటుంబ సమస్యలు, అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురలో ఉంటున్న నాగమణి (45) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..


మృతుడు రోహిత్

అంబర్‌పేట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రేమ్‌నగర్‌లో నివసించే భద్రునాయక్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. రెండో కుమారుడు రోహిత్ నాయక్(29) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో అమ్మ, తమ్ముడితో ఉంటూ నిత్యం వేధించేవాడు. అతడి వేధింపులు తట్టుకోలేక సమీపంలో మరో ఇంట్లో ఉంటున్నారు. సోమవారం రోహిత్‌నాయక్ ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చావురస్తా.!

ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా

- ఎగుడుదిగుడుగా రోడ్డు.. ఆదమరిస్తే అంతే సంగతులు
- గుంతలు, కంకర తేలిన రోడ్డుతో తప్పని తిప్పలు
- అదుపు తప్పి పడిపోతున్న వాహనదారులు
- ఫ్లైఓవర్ కింది రోడ్డు నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు






ఎగుడు దిగుడుగా శ్రీరమణ చౌరస్తా రోడ్డు

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రధాన రోడ్డు ఫ్లై ఓవర్ కింద శ్రీరమణ చౌరస్తా రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఫ్లైఓవర్ నిర్మాణంతో కింద నిర్మించిన సర్వీసు రోడ్డు ఎత్తుగా వేయడంతో దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా లోతట్టు ప్రాంతంగా మారింది. చే నంబర్ చౌరస్తా, రామంతాపూర్ వైపు వచ్చే వాహనదారులు ఇక్కడ మలుపు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌరస్తాలో వాహనాలను మళ్లించడానికి వాహనదారుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అలాగే దిల్‌సుఖ్‌నగర్ నుంచి వాహనదారులు రామంతాపూర్, చే–నంబరు చౌరస్తా వైపు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఇక్కడి చౌరస్తాకు రాగానే వాహనదారులకు నరకం కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.

కంకర తేలిన రోడ్డు..
వాహనాలు అటు ఇటు..

చౌరస్తాలో ఉన్న సమాంతరంగా లేకపోవడంతో పాటు ఏటావాలుగా ఉంది. అంతేకాకుండా ఉన్న దారి సైతం గుంతలు, తేలిన కంకరతో వాహనం నడపలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఏ మాత్రం తేడా వచ్చినా రోడ్డుపై పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలైన సంఘటనలూ ఉన్నాయి. ఫ్లైఓవర్ కింద రోడ్డు నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుంతలు, కంకర తేలిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఆ తర్వాత పూర్తిస్థాయి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మా పరిధిలోకి రాదు: జీహెచ్ఎంసీ అధికారులు

అంబర్‌పేట ఫ్లైఓవర్ కింది రోడ్డు తమ పరిధిలోకి రాదని స్థానిక జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తుందని చేతులు దులుపేసుకుంటున్నారు. ఆర్అండ్‌బీ విభాగం అధికారుల దృష్టిలో ఈ సమస్య ఉన్నా పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి


బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో రక్తదాన శిబిరంలో దీపక్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి

కాచిగూడ: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి పిలుపునిచ్చారు. తలసీమియా బాధితుల కోసం లంకల దీపక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సిటీ సర్కిల్ జూబ్లీ హిల్స్ ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డితో కలిసి ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడమే కాకుండా తోటి వారిని కూడా ప్రోత్సహించాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలపై మరింత విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, యువ మోర్చా నేతలు రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమారాణి, వై.అమృత, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్, పార్టీ నేతలు బంగారు శృతి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎ.అజయ్‌కుమార్, సి.వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు యువత పనిచేయాలి



హిందూ వాహిని సభలో మాట్లాడుతున్న రవినూతల శశిధర్

ముషీరాబాద్: హిందూ ధర్మ పరిరక్షణ కోసం యువత అంకితభావంతో పని చేయాలని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రవినూతల శశిధర్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ హౌస్ వద్ద హిందూ వాహిని భోలక్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో 'బలిదాన్ దివస్'ను పురస్కరించుకొని నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశం, ధర్మం కోసం హిందువులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్య్రం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల ప్రాణత్యాగాల వల్లనే ఈ స్వేచ్ఛగా బతుకుతున్నామని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహని ప్రధాన కార్యదర్శి బబ్లూ విశ్వేశ్వర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు అయిల భాస్కర్, నాయకులు కేఎంశంకర్, ఆర్.విశ్వం, మురళీ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత


సంజీవ హనుమాన్ దేవాలయంలో కలశ పూజలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌లోని సంజీవ హనుమాన్ దేవాలయంలో సోమవారం వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పట్టువస్త్రాలను తీసుకొచ్చి పండితులకు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దేవాలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు, ఉగాది పురస్కారాలు, శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, బింగి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామార్కండేయ, పుండరీకం, కోశాధికారి గడ్డం నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 108 కలశాలతో అభిషేకం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటలకు 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ దేవనాథం తెలిపారు. ఈ విశేష అభిషేక క్రతువును తిలకించి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పింఛన్లు పెంచే వరకు ఉద్యమిస్తాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని వికాలంగుల జాతీయ హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ... పెన్షన్ల పెంపుదలకు నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం 2024–25లో ఆసర పింఛన్ల కోసం రూ.14628.91 కోట్లు కేటాయిస్తే 2025 మార్చి నాటికి రూ.10,514.32 మాత్రమే ఖర్చు చేసిందన్నారు. పెన్షన్‌లు పెంచేంతవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె. వెంకట్, ఉపాధ్యక్షులు కె. సాయమ్మ, నాగలక్ష్మి, కోశాధికారి ఆర్. వెంకటేష్, యశోదా, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

డా.మహేంద్రకుమార్‌రెడ్డికి వైద్య సేవారత్న పురస్కారం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 'సర్వేజన సుఖినోభవంతు' సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవ స్వర్ణనంది, విశ్వవసు పేరిట అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశిష్టసేవలు అందిస్తున్న లయన్ డాక్టర్ జి. మహేంద్రకుమార్‌రెడ్డిని వైద్య సేవారత్న జాతీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న యాదగిరి శ్రీనివాస్, కొమిరి కృష్ణమూర్తి, బక్కా సత్యనారాయణ, రేగుంట్ల శ్రావణి, పద్మావతి తదితరులను ఉగాది జాతీయ పురస్కారాలతో సత్కరించి అభినందించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ డా. చంద్రయ్య మాట్లాడుతూ... డబ్బు ఎంత ఉందనేది ముఖ్యం కాదని ఇతరులకు సహాయం చేస్తూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ సూర్యనారాయణ మాస్టర్, ప్రధాన కార్యదర్శి ఈ సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్, మందడి కృష్ణారెడ్డి, దైవజ్ఞ శర్మ, భారతి, లయన్ నైనాదేవి, పెంటపాటి కృష్ణాది శేషు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తాం


శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీరామనవమి వేడుకల కమిటీ నేతలు

కాచిగూడ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 6వ తేదీన బర్కత్‌పురలోని శ్రీనల్లపోచమ్మ దేవాలయం వద్ద శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీరామనవమి వేడుకల కమిటీ కన్వీనర్ సూర్యప్రకాష్ సింగ్ తెలిపారు. సోమవారం శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 6వ తేదీన సాయంత్రం శ్రీరామనవమి శోభాయాత్ర ఉంటుందన్నారు. బర్కత్‌పురలోని నల్లపోచమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై తుల్జాభవన్, టూరిస్ట్ హోటల్, లింగంపల్లి చౌరస్తా, కాచిగూడ స్టేషన్ రోడ్డు, వీర్ సావర్కర్ విగ్రహం, బర్కత్‌పుర, రాఘవేంద్రస్వామి మఠం మీదుగా తిరిగి నల్లపోచమ్మ దేవాలయానికి చేరుకుంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


రాంనగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గోల్కొండ చౌరస్తా నుంచి రిసాల కుర్షిద్ మసీదు వరకు రోడ్డు, ముస్లిం శ్మశానవాటికలో వీధిదీపాలు, మెస్కో చర్చి లైన్, అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ, నీటి పైపులైన్ వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జలమండలి డీజీఎం మోహన్‌రాజు, మేనేజర్ శివసాయి, సూపర్‌వైజర్ గౌస్, డీఈ గీత, ఏఈ మురళీ, బీఆర్ఎస్ నాయకులు శంకర్‌ముదిరాజ్, మన్నె దామోదర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఖ్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రచనా నైపుణ్యంపై సర్టిఫికెట్ కోర్సు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ అధ్యక్షుడు డా. డి.కుమారస్వామి అధ్యక్షతన 'రైటింగ్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డా. కె.ప్రభు హాజరై మాట్లాడారు. సృజనాత్మకంగా రాయడం అనేది ముఖ్యమైనదని అన్నారు. జర్నలిజం, రచనా రంగంలో కూడా రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు వెంకటేశ్వర్, డా. ఆర్.లావణ్య, అధ్యాపకులు డా. ముక్తవాణి, రాజశేఖర్, డా. అనురాధ, డా. బాణాల శ్రీనివాస్, డా. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు వెంటనే ఆపాలి

- నల్లవల్లి, ప్యారానగర్ రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతల డిమాండ్

కవాడిగూడ: ప్యారానగర్, నల్లవల్లి డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సంగారెడ్డి జిల్లా జేఏసీ, ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జేఏసీ నేతలు, ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జేఏసీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య హాజరై మాట్లాడారు.

ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదు..

◆ సంగారెడ్డి జిల్లా పరిధిలోని గుమ్మడి దళ మండలం నల్లవల్లి, ప్యారానగర్ డంపింగ్‌యార్డ్‌ను వెంటనే రద్దు చేసి స్థానిక రైతులు, ప్రజలను ఆదుకోవాలన్నారు. నల్లవల్లి గ్రామపంచాయితీ పరిధిలోని ప్యారానగర్ శివారులో 152 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డ్‌కు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఏకపక్షంగా నిర్మాణ పనులు చేపడుతోందని ఆరోపించారు.

రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారక ముందే నిలిపేయాలి...

◆ ఆ ప్రాంత ప్రజలు, రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారక ముందే ప్రభుత్వం డంపింగ్‌యార్డ్ నిర్మాణాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే స్థానిక రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు బి.నాగేశ్వర్‌రావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జైరాజు, జేఏసీ నాయకులు రామకృష్ణ, శేఖర్, మల్లేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, గుమ్మడిదళ, హత్నూరా మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ధర్నాచౌక్ అభివాదం తెలుపుతున్న జేఏసీ నాయకులు, రైతులు, నల్లవల్లి, ప్యారానగర్ ప్రజలు

'ఆదివాసీల జీవించే హక్కును హరిస్తున్నాయి'

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు న్యాయవాది బేలాభాటియా ఆగ్రహం
- మారణకాండపై విచారణ చేపట్టాలని డిమాండ్


ఎస్వీకేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బేలాభాటియా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మావోయిస్టుల నెపంతో ఆదివాసీల జీవించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు న్యాయవాది బేలాభాటియా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను మీడియా, ఆదివాసీ సమాజాలు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక సంఘాల రిపోర్టుల ఆధారంగా సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలనే డిమాండ్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా బేలాభాటియా మాట్లాడుతూ... సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయి నాయకత్వంలో మణిపూర్‌కు వెళ్లినట్లుగానే బస్తర్‌కు వెళ్లి రాజ్యాంగంలో పొందుపరిచిన జల్, జంగిల్, జమీన్ టెర్రిటరీ మీద ఆదివాసీల అధికారం, పేసా వంటి చట్టాలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని కోరారు.


దండకారణ్యం రణరంగంగా మారింది..

◆ సామాజిక వేత్త డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ... గతేడాది జనవరి నుంచి దండకారణ్యం రణరంగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ల పేరుతో ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రా, ఒడిస్సాలలో కాల్పులు చేస్తున్నారని అన్నారు. 2026 నాటికి మావోయిస్టు అనేవాడు ఒక్కడు కూడా లేకుండా రూపుమాపడమే లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించి యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, సీపీఐ నేత కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, మాజీ మావోయిస్టు జంపన్న, న్యాయవాదులు రఘుకుమార్, వెంకన్న, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, గద్దర్ మెమోరియల్ కమిటీ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సాయుధ హింసను రూపుమాపాలి

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ... దండకారణ్యంలోని ఆదివాసీలు, మావోయిస్టులపై 'కగార్' పేరుతో భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న అంతిమ యుద్ధాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సాయుధ హింసను రూపుమాపి స్థిరమైన శాంతి, సయోధ్యను సాధ్యం చేసే దిశగా యుద్ధాన్ని నిలిపేయాలని కోరారు. రాజకీయ చర్చలతో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ఇరువైపుల కాల్పుల విరమణను పాటించాలన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

ముషీరాబాద్: 'ఆపరేషన్ కగార్' పేరిట కొనసాగుతున్న ఆదివాసీ జాతి హననాన్ని ప్రతి రాజకీయ పార్టీ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెడితే తమ జాతి మనుగడకే ప్రమాదం ఉందన్నారు. దానికి వ్యతిరేకంగా నిలబడటమే నేరంగా పరిగణించి మొత్తం ఆదివాసీ జాతి హననానికి పూనుకోవడం బాధాకరమన్నారు. భారత రాజ్యాంగం ఆదివాసుల హక్కులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. షెడ్యూల్ 5, షెడ్యూల్ 6లలో వారి రక్షణ కోసం.. వారి ఉన్నతి కోసం ఎన్నో చట్టాలకు అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వాలు దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని అసెంబ్లీలో తీర్మానానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జె.వి.చలపతిరావు, కె.గోవర్ధన్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, జి.ఝాన్సీ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.